# మూడో పేజీ

"పిల్ల చురుగ్గా ఉండాలి"

"కస్తూరీ!!!"

"సన్నగా, పొడుగ్గా-"

"కస్తూరయితే!?"

"మరీ తెల్లగా పిండి బొమ్మలా ఉండకూడదు. చామన ఛాయగా..."

"అరె! మన కస్తూరిని చూస్తే-"

"కనుముక్కు తీరు అందంగా"

"ఓ..."

"కళ్ళు, ముఖ్యంగా మెరుస్తూండాలి"

"మిలమిల్లాడిపోతూ ఉంటాయి".

"మంచి జోక్స్ వేస్తూ - హుషారుగా."

"ఏం చెప్పమంటారు? మీరు మా కస్తూరిని ఒక గంటసేపు పరిశీలించారంటే..."

"గలగల్లాడుతూ, నవ్వుతూ, తుళ్ళుతూ అందర్నీ ఆటపట్టిస్తూ..."-

"అయ్యో! ఇంకా ఏమిటి మాట్లాడుకునేది? రేపు వచ్చి మా కస్తూరిని చూసి ఖాయం చేసుకోండి"-

రాంప్రసాద్ తెల్లగా కాస్త పొట్టిగా, చూడంగానే గుండ్రంగా అనిపిస్తాడు. మితభాషి, మొత్తం అతని కొచ్చిన అన్ని భాషల్లోని పదాలు కలిపితే రెండు వందలకి మించవు ఉ! ఆ... అవును - వద్దు - సరే - వస్తా - కాదు - రేపు - నిన్న

–ఇలాంటి పొడిగా ఉండే అత్యవసర మాటలతోనే అతను పూట గడిపేస్తాడు. కానీ అతనికి గలగల మాట్లాడుతూ, కేరింతలు కొడుతూ, జోక్స్ వేస్తూ హుషారుగా ఉండే అమ్మాయిని పెళ్ళి చేసుకుంటే బాగుంటుందని, ఇష్టమనీ అనుకుంటాడు. అందుకే అతను పెళ్ళికోసం పిల్లని చూడబోయిన వాళ్ళకి తనకెలాంటి అమ్మాయి కావాలో సంక్షిప్త భాషలోనే వివరంగా చెప్పాడు.

ఆర్.టి.సి.లో ఉద్యోగమంటే సామాన్యం కాదు. ఒకటో తారీఖున జీతం ఘళ్ళున చేతిలో పడుతుంది. ఒకవేళ ఒకటి శలవైతే ముందు రోజే కాసులు జేబులో పడతాయి. ఏడాదికి రెండు బస్సు ప్యాసులు. వైద్య సదుపాయం, పిల్లల చదువులకి ఫీజులు, ఏడాదికి ఎక్స్‌గ్రేషియా – ఆలస్యం చేయకుండా అప్పులిచ్చే సహకార సంఘం – మరి, ఇవన్నీ ఏకరువు పెడతారు రాంప్రసాద్‌ని పెళ్ళికొడుకుగా చూపెట్టే మధ్యవర్తులు.

కస్తూరి నిజంగా చురుకైంది. తెలివైంది. మంచి మాటకారి. ఎంతటి వారినైనా వేళాకోళం చేసిపారేయగలదు. ఎలాంటి జోకైనా ఎవరి మీదనైనా అవలీలగా వేసేయగలదు. హాయిగా నవ్వేయగలదు. ఖేదమొస్తే దులిపేయగలదు. ప్రేమొస్తే బాహాటంగా ప్రకటించగలదు. తనకిష్టంలేకపోతే ఖండించగలదు. స్వేచ్ఛగా ఉండ గలదు. స్వేచ్ఛను ప్రకటించగలదు.

అలాంటి కస్తూరి రాంప్రసాద్ పెళ్ళికూతుళ్ళ లిస్టులో మొదట ఉంది. ఆమెకి నచ్చకపోవటానికి రాంప్రసాద్‌లో ప్రత్యేకం ఏమీ కనిపించలేదు. బాగా ఆలోచించు కోవడానికి ఇంట్లోవాళ్ళు అవకాశమూ ఇవ్వలేదు.

ఆకాశవాణిలో కొత్తగా ఉద్యోగంలో చేరిన కస్తూరికి, ఆర్.టి.సి.లో ఆదిగా పనిచేస్తున్న రాంప్రసాద్‌కి, అడవిలోన ఉసిరికి, సముద్రంలో ఉప్పుకు కలిపినట్టే కలిపారు దైవజ్ఞులనే పెద్దలు.

"మరీ అంత బిక్కమొహం పెట్టారేంటీ ఏదో ఇష్టంలేని పెళ్ళి చేసుకునే వాడిలా, కాస్త నవ్వు ముఖం పెట్టి కూర్చోండి" పెళ్ళిపీటల మీద కస్తూరి ఓరకంట చూస్తూ అనే సరికి, రాంప్రసాద్ నిజంగానే బిక్కముఖం వేశాడు. "ఏమిటీ నలుగురిలో మరీ..." అనుకున్నాడు మనసులో కాస్త సర్దుకున్నాడు.

పెళ్ళిలో ఆటలన్నీ కస్తూరే నెగ్గింది. పైగా 'కమాన్' అంటూ ఉషారు చేస్తూ రెచ్చిపోయింది. కస్తూరి స్నేహితురాళ్ళంతా రాంప్రసాద్ వైపు చేరి మహా ఉషారు చేసి పెళ్లి సందడి పెంచారు.

కథా నిలయం
శ్రీకాకుళం

అక్కడికీ ఒకరిద్దరు 'మరీ అంత బుద్ధావతారమైతే ఎలాగండీ' అంటూ అననే అనేశారు.

ఆ మాటలు ఆ కోలాహలమైన సందడిలో కొట్టుకుపోయాయి.

ఆ రాత్రి వాళ్ళ మొదటి రాత్రి. రాంప్రసాద్‌కి ఉత్సాహాన్ని మింగేసే బెరుకు ఆవహించింది. అయినా సర్దుకున్నాడు. తీరా పెళ్ళయిపోయింది. అయినా కస్తూరితో ఏకాంతం అతన్ని ఊరిస్తోంది.

రాంప్రసాద్ గదిలోకి వెళ్లి రెండడుగులు వేసేలోగా కస్తూరి పరుగెట్టుకొచ్చి అతన్ని వాటేసుకుంది. అతను బిత్తరపోయాడు.

"అబ్బ! ఏమిటిది?" అన్నాడు.

"అబ్బే ఏం లేదు. నేను మట్టిని ముట్టుకున్నా బంగారమవుతుందని వారఫలాల్లో రాశాడు" అంది చిలిపిగా.

అతని కా సరసం జీర్ణం కావడానికి చాలా టైమే పట్టింది. చలాకీ అమ్మాయిగా కనిపించేదానికీ, ఆమె భార్య అయి దగ్గర చేరిన దానికీ అన్వయించుకోవడంలో ఉన్నాడతను. తిప్పుకున్నాడు.

"నిన్ను చూసి నేనేమనుకున్నానో తెలుసా" అన్నాడు.

"నన్ను చూసి మీరేం అనుకోలేదు. అన్నీ అనుకున్నాకే నన్ను చూశారు' అంటూ కొట్టి పారేసింది. వెంటనే ఏం చెప్పాలో అతనికి తోచలేదు.

"పోనీ నన్ను చూసి నువ్వేమనుకున్నావు?" తనకున్న తెలివంతా ప్రదర్శించాడు.

"విమ్ వేసి తెల్లగా తోమిన సేలం స్టీలు పళ్ళెంలా ఉన్నారనుకున్నాను" ఠపీమని చెప్పేసింది కస్తూరి. ఆమె మాటలు, పెదవుల మధ్య బిగించిన నవ్వూ అతని గుండెల్లో సూటిగా గుచ్చుకున్నాయి.

"నీకసలు మర్యాదగా మాట్లాడ్డం తెలీదా" అన్నాడు చిరాగ్గా.

"ఇందులో పెద్ద అమర్యాదేముంది? అయినా మీకు చమత్కారంగా జోక్స్ వేస్తూ ఉషారుగా ఉంటే ఇష్టమటగా."

"ఇష్టమే కానీ నా మీదనా నీ జోక్స్"

కస్తూరి పకపకా నవ్వేసింది.

"జోక్ అంటే జోకే – అది వీరిమీద వేద్దాం. వీరి మీద వద్దు అని ఉంటుందా చెప్పండి"

"పోనీలే - అది సరే గానీ ఈ నైటీ ఏమిటి? శోభనపు పెళ్ళికూతురెలా ఉండాలి. తెల్లటి చీర జడనిండా మల్లెలు చేతులకు గోరింటాకు. గలగలమనే గాజులు మెడలో-"

"చాలు చాలు - మీకు తెలుగు సినిమా శోభనం బాగా వంట బట్టినట్టుందే"

"సినిమా లేదు, గినిమా లేదు, అది మన సంస్కృతి"

"అదే సంస్కృతి అయితే నా కొద్దులెండి. హాయిగా ఫ్రీగా ఉంది"

అతను అసహనంగా కదిలాడు.

"అయినా మీకు చాలా మోడరన్‌గా ఉంటే ఇష్టమటగా"

"ఇష్టమే.. కానీ ... ఇక్కడా? నా దగ్గరా?

"మరెక్కడా?"

"అమ్మ చూస్తే ఏం బాగుంటుంది"

"మీ అమ్మగారెందుకు చూస్తారూ... తప్పు కదూ" కొంటెతనపు అమాయకపు ముఖం పెట్టింది.

"సరే - అవన్నీ వదిలెయ్"

"సరే వదిలేశాను"

"మంచి కబుర్లు చెప్పు"

"బోలెడు ఉన్నాయి. కానీ ఇది.. .కార్యం రాత్రా... కబుర్లే"

"ఛీ సిగ్గు లేదు"

"మీరేగా అన్నీ వదిలేయమన్నారు".

❖ ❖ ❖

"ఓ.కే. రేపు నేను పదింటికి ఆఫీసుకెళ్ళాలి"

"ఎందుకు?"

"నెల్లాళ్ళ క్రితం ప్లాన్ చేసిన ఓ ప్రోగ్రామ్ ఉంది"

"పెళ్ళని చెప్పకపోయావా?"

"అయిపోయిందిగా"

"ఈ మూడు రోజులు"

"రాత్రులు..."

"ఛీ... మరీ బరితెగించి మాట్లాడుతున్నావు" - కస్తూరి నవ్వేసింది.

ఆ రాత్రి రాంప్రసాద్‌కి థ్రిల్లింగ్‌గానే గడిచినా, ఏదో భయం, జరగగూడనిదేదో జరుగుతోందనే బెరుకూ ఉండనే ఉన్నాయి. ఎగ్రసివ్‌గా ఉన్న కస్తూరిని చూపి తనని తను నిభాయించుకోవడానికే శక్తి నుపయోగించాడు రాంప్రసాద్.

❖ ❖ ❖

సమయపాలన ఆకాశవాణికి ఆయువు పట్టయితే, ఆర్.టీ.సి.కి అది అసాధ్యమైన విషయం. నిముషాలు లెక్కపెడుతూ పనులు చేసుకుపోయే కస్తూరికి క్షణ క్షణం ఆగిపోతూ, బద్ధకంగా సాగే రాంప్రసాద్‌కీ జీవనయాత్ర ముందుకు మూడడుగులు వేస్తే వెనక్కి, అరడుగులు వేస్తానన్నట్లు మొదలైంది.

రాంప్రసాద్ ఏం చేయాలన్నా కూడికలు తీసివేతలు చేసి, హెచ్చవేతలు, భాగారాలు చూసి, నిర్ణయిస్తాడు. అది ప్రయాణమైనా ప్రాణమైనా అతనికి లెక్కలు తేలాకనే, లాభనష్టాలు బేరీజు వేశాకనే - ఈ లోపున ఎవ్వరెంత చెప్పినా, ఏం చేసినా వినే ప్రసక్తే లేదు. పైగా అతను లెక్కలు వేశాక అందులో అతనికి లాభం కనిపిస్తేనే పని ముందుకు సాగుతుంది. మంచి, మర్యాద, ముద్దు, మురిపెం, అచ్చట ముచ్చట లాంటివి నిర్దాక్షిణ్యంగా పక్కన పెట్టేస్తాడు. ఎదుటివారి ఖర్చు మీద ఎంత సరదా జరిగినా ఫర్వాలేదు. సొంత ఖర్చు అంటే వెనకడుగే.

పెళ్లయిన వెంటనే ఎక్కడికైనా వెళ్దామనుకుంటే బస్సా, రైలా అనే చోటనే ఆగిపోయింది. ఆర్.టీ.సి. బస్సు వెళ్ళే ప్రదేశాలకే వెళ్దామని రాంప్రసాద్ ప్రతిపాదించాడు. కస్తూరికేం తోచలేదు.

"ఊటీ..."

"ప్చ్! కుదరదు.."

"కొడైకెనాల్"

"ప్చ్"

"బెంగుళూరు లేక మద్రాసు"

"సర్వీసులు తక్కువ. పాస్ మీద కష్టం"

ఇలా... ఇలా.. కస్తూరిలో ఉత్సాహం చచ్చిపోయి, శలవు కాన్సిల్ చేసుకుని ఉద్యోగంలో చేరిపోయింది.

చేతినిండా జీతం వస్తున్నప్పటికీ, అదంతా పరాయి ధనంలా అనిపించేది కస్తూరికి. తనెవరికో అప్పున్నట్టూ, అది జాగ్రత్తగా తీసుకెళ్ళి వాళ్ళ చేతుల్లో పోయాల

స్ఫుటంగా అనిపించసాగింది. అందులోంచి, రెండు వందలు కావాలన్నా, మూడొందలు కావాలన్నా ఎంతో సంజాయిషీ చెప్పి, లెక్కలు చూపించి, ఒప్పించి దేబిరించి తీసుకోవాలి. అతని దయాధర్మాల మీద తన కష్టార్జితం ఖర్చు పెట్టాలన్న భావం ఆమెని రోజు రోజుకీ కృంగదీసింది. ఎప్పుడైనా ప్రాణం విసిగి, కాస్త ఎదురు చెప్తే ఆ రోజు పెద్ద రాద్ధాంతమే - ఇంట్లో అందరి ముందూ దోషిగా నిలవాల్సిందే-

"ఏమో! మొగుడి డబ్బూ నా డబ్బూ వేరనే ఊహే రాదు మాకెప్పుడూ" అని ఒకరు-

"భార్య సంపాదిస్తే ఆ డబ్బు మీద భర్తకి అధికారం ఉండదా. ఏం?" అని మరొకరు.

"ఏమోనర్రా! డబ్బు కోసం పోట్లాడుకోకండి" అనే అత్తగారి సీరసపు సన్నాయి నొక్కులు.

అవన్నీ కస్తూరిని కట్టిపడేసేవి. ఒక్కరంటే ఒక్కరు కూడా ఆమె సంపాదనలో కనీసం కొంతైనా ఆమె సొంతానికి ఖర్చు పెట్టుకుంటే తప్పేమిటన్న వాళ్ళు లేరు.

పోనీ డబ్బును పక్కన పెట్టేస్తే అద్భుతమైన ప్రేమానురాగాలు ఉన్నాయా అంటే అసలు ప్రేమనే పదార్థమే అతని దగ్గర సున్నా. కొందరు జీవిస్తారు కానీ ఎవర్నీ ప్రేమించరు. ఒకర్ని ఇష్టపడడం, వారి కోసం బెంగపెట్టుకోవడం, వారి కోసం నిరీక్షించటం లాంటివి ఉండవు. భార్య పుట్టింటికి వెళ్తే, వంటకి ఇబ్బందనీ, ఏ బస్సుకి వస్తోందో తెలిస్తే, వెళ్ళి రిసీవ్ చేసుకోవడం బాధ్యతనీ భావించే వాళ్ళే ఎక్కువ.

రాంప్రసాద్ ఇంక్రిమెంట్ డేట్ దగ్గర నుండి, పెరిగిన ప్రతీ డి.ఏ. స్లాబ్ గుర్తు పెట్టుకుని లెక్కలు కడుతుంటే కస్తూరికి సహించటం కష్టమైపోయింది. రతిక్రీడలో కూడా అతను రాబోయే ఎక్స్‌గ్రేసియా గురించి, మెడికల్ రీఎంబర్స్‌మెంట్ గురించీ మాట్లాడడంతో ఆమెకి జీవితం రసహీనంగా అనిపించసాగింది.

ఒకసారి ప్రాణం విసిగిపోయి "అసలు నా జీతం ఇంట్లో ఇవ్వను" అంది. అప్పట్నించీ గొడవలు ప్రారంభమయ్యాయి, ఇద్దరూ బద్ధశత్రువుల్లా అయిపోయారు. అటు కొందరు, ఇటు కొందరు చేరి అగ్నికి ఆజ్యం పోసి, ఏ మూలో ఉన్న సున్నిత బంధాన్ని తెంచేశారు.

ఉద్యోగరీత్యా ఇంటికి రావడం ఆలస్యమైనా బయట కార్యక్రమాలు చేసేందుకు వెళ్ళినా మొగుడంటే లక్ష్యం లేని మనిషి ఎక్కడ అయినా తిరుగుతుంది' అనడం - బాధించడం అలవాటైపోయింది.

"ఎలా వచ్చావ్?"

"ఆటోలో" అలసటగా మంచినీళ్ళ కోసం లోపలికెళ్ళబోతున్న కస్తూరిని ఆపి "ఇదిగో- ఇలా అయితే కుదరదు. రోజూ ఆటోల్లో తిరిగితే నీ సంపాదన చాలినట్టే' అన్నాడు.

"అబ్బ! కాస్సేపు ఆగండి. నాకు వంట్లో బాగోలేదు. తలనెప్పి వికారంగా ఉంది" అంటూ భర్తని తప్పించుకుని లోపలికెళ్ళింది.

"ఏమైనా అంటే ఇదోటి - వంట్లో బాగుండలేదంటే నోరెత్తలేం కదాని.."

"అంటే - అబద్ధమాడుతున్నానా"-

"అదంతా నా కనవసరం - పద్ధతి మార్చుకో - కాస్త ఓర్చుకోవాలి మూడు రూపాయలతో వచ్చే దానిని ముప్ఫై రూపాయలు తగలేస్తే ఎలా?"

కస్తూరి చల్లటి నీళ్ళతో ముఖం కడుక్కుని, తుడుచుకోనైనా తుడుచుకోకుండా మంచం మీద వాలిపోయింది. ఆమె కళ్ళల్లో నెమ్మదిగా ఊరిన కన్నీళ్ళు చెంపల మీదకి జారినా తడిగా ఉన్న ముఖం ఆ కన్నీళ్ళని తనలో ఇముడ్చుకుంది. ఆమె మనసు అవమానంతో కుతకుతలాడిపోయింది. నూరేళ్ళ తన భావి జీవితం కళ్ళకు కట్టింది -

ఆ రాత్రంతా ఆమె నిద్రపోలేదు. ఉదయం లేస్తూనే ఉన్నట్టుండి పుట్టింటికి వచ్చేసింది. తల్లీ దండ్రీ ఆమెనేమీ అనలేదు. చెప్పినదంతా శ్రద్ధగా విన్నారు. అన్నయ్య మాత్రం పూర్తిగా సమర్థించి "నీకేం భయంలేదు. హాయిగా ఇక్కడే ఉండు" అన్నాడు.

"ఇలాంటి చిన్న చిన్న విషయాలకి ఇలా వచ్చేస్తే ఎలాగే?" అంటూ వాపోయింది తల్లి.

"చిన్న విషయం అంటావేమిటే మొద్దు మొఖమా" అన్నాడు తండ్రి. అప్పటికే నాలుగు నెలల కడుపుతో ఉంది కస్తూరి. తిండీ, మనశ్శాంతీ లేక చిక్కి సగమైన కూతుర్ని అక్కున చేర్చుకుంది తల్లి.

కస్తూరికి విడాకులివ్వమని అడిగితే, ఏడిపిద్దామనుకున్న రాంప్రసాద్‌కి తల్లి జ్ఞానబోధ చేసింది.

"నాయనా విడాకులిచ్చేయ్, నీకు బోలెడు కట్నంతో పిల్లనిస్తారు దేశమేం గొడ్డుపోలేదు"

ఏడాది దాటేసరికి మ్యూచువల్ డైవర్స్ సులభంగానే లభించాయి. అవి వచ్చే నాటికి పాపకి నాలుగు నెలలు. కస్తూరి తల్లే ఆ చంటిదాన్ని అన్నీ చూసి పెంచుతోంది.

ఆఫీసులో కొందరు సానుభూతి చూపించారు. కొందరు ధైర్యం చెప్పారు. కొందరైతే అతి చనువును, స్నేహాన్ని ప్రదర్శించారు.

ఇప్పుడు కస్తూరిలో చురుకుదనం, మాటకారితనం అన్నీ మూడొంతులు తగ్గిపోయాయి. ఎవరో నమిలి పారేసిన పిప్పిలా, భగ్గున మండి చప్పగా చల్లారిన కొలిమిలో బూడిద కుప్పలా అయిపోయింది కస్తూరి. అదంతా మొగుడు లేడనే బెంగతో కానే కాదు, పొందిన అవమానం మిగిల్చిన వేదన.

వేరే రకమైన దినచర్య మొదలైంది కస్తూరికి. పాపని చూసుకోవడం అమ్మే అయినా అమ్మని పూర్తిగా తనే చూసుకుంటోంది. పాపకి కావల్సిన పాల డబ్బాలు, ప్యారెక్స్‌లు, అరటిపళ్ళు, బిస్కట్లు, ఖర్జూరాలు తెస్తూ అమ్మకి మందులూ, బత్తాయిలూ, గ్లూకోజు, హార్లిక్సూ ముందు జాగ్రత్తగతా మెటాసిస్‌లు, బ్రూఫిన్లు – ఇంట్లో తనవంతుగా డబ్బు – అదికాక పాలకి, పని మనిషికి, ఇస్త్రీ బట్టలకి, ఇరుగు పొరుగు అప్పులకీ, అలా అలా అంతా అయ్యాక కస్తూరి చేతిలో రెండు మూడు వందలు మిగిలినా గొప్పగానే ఉండేది.

పాపకి తనేమి పేరు పెట్టలేదు. తల్లే 'సావిత్రి సావిత్రి' అని పిలవడం మొదలు పెట్టింది. అది వాళ్ళమ్మ పేరని ఆమెకి అభిమానం, కస్తూరేం మాట్లాడలేదు. ప్రతిభ, ప్రజ్ఞ, గ్రీష్మ, రంజని, రశ్మిలాంటి ఆధునాతనమైన పేరేదో పెట్టి, పిలిచి మురిసిపోవాలనే ఉత్సాహం కస్తూరిలో చచ్చిపోయింది. మనిషి నిరాశలో జీవన పోరాటం సాగించేప్పుడు స్నేహాన్ని, మనసులోని బాధని, మాటని చెప్పుకునేందుకు ఒక తోడుని కోరుకోవడం సహజం. అలాంటి సహజమైన పరిణామంగానే కస్తూరికి రవితో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ కలిసి రేడియో కార్యక్రమాలు రూపొందించటంలో దగ్గరయ్యారు. కస్తూరిలో తెలివి, నిజాయితీ రవిని ఆకర్షించాయి. రవి చురుకుగా, కొంత దర్పంగా, విలాసంగా, దిలాసాగా ఉండడం కస్తూరికి వచ్చింది. అన్నిటికీ అతను స్నేహమంటే ప్రాణమిస్తాడు. స్త్రీ వాదాన్ని సమర్థిస్తాడు. స్త్రీ స్వేచ్ఛని ప్రశంసిస్తాడు. స్త్రీలు పురుషుల కంటే ఏ మాత్రం తక్కువ కాదని, వేదిక లెక్కి బల్లగుద్ది మరీ చెప్తాడు.

రవి స్నేహం ఆమెలో కొత్త ఊపిరి పోసింది. ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్‌గా రవి ఉంటే ప్రోగ్రామ్ అసిస్టెంట్‌గా కస్తూరి ఉత్సాహంగా పనిచేయటం మొదలుపెట్టింది. ఇద్దరూ స్వేచ్ఛగా మాట్లాడుకుంటూ స్టూడియోల్లోనూ, కాంటీన్‌లోనూ, కారిడార్లలోనూ అందరికీ కనిపిస్తూనే ఉన్నారు. కస్తూరి తనలోని బాధని అతనికి చెప్పుకుంది. అతనికి ఆమె యందు సానుభూతి ఉంది. స్నేహం ఉంది.

❖ ❖ ❖

"కస్తూరీ" అన్నయ్య గొంతు నెమ్మదిగా ఉన్నా సీరియస్‌గా ఉంది.

"ఏమిటన్నయ్యా" కస్తూరి గొంతు తెలియకుండానే ఒణికింది.

"ఏమిటే? మీ ఆఫీసులోఎవరో రవి అని పెక్స్ ఉన్నాట్ట. అతనితో నువ్వు క్లోజ్‌గా మూవవడం ఏం బాగాలేదు"

"అది కాదన్నయ్యా..."

"నువ్వేం చెప్పకు జాగ్రత్తగా ఉండు. ఇలాంటివి మంచిది కాదు. మన పరువు, మర్యాదా అన్నీ ఆలోచించుకోవాలి. అసలే నువ్వు దెబ్బతిన్నావు. సంఘంలో నువ్వూ, మేమూ తలెత్తుకు తిరగాలంటే నువ్వు నిప్పులా ఉండాలి' అన్నయ్య మరేం మాట్లాడలేదు. పక్కన పొంచి ఉన్న నాన్న రంగప్రవేశం చేశాడు.

"అల్లుడు నీ మీద వేసిన నిందని నువ్వు రూపుమాపుకోవాలి. నీ నిజాయితీని, శీలాన్ని నిరూపించుకోవాలి. పందమందిలో ఉన్నా నిప్పులా ఉన్నావనే పేరు తెచ్చుకోవాలి. ఇప్పటికే నేనూ అమ్మా సగం చచ్చి బతుకుతున్నాం"

అంతా నిశ్శబ్దం, కస్తూరిలో ఆత్మఘోష.

"నువ్వు మొగుడ్ని వదిలేసి వచ్చినా నెత్తిన పెట్టుకున్నాం" చివరి అస్త్రం కస్తూరిని సూటిగా తాకింది.

నిప్పులా ఉండడమంటే ఏమిటి?

రాంప్రసాద్ దెబ్బై వేలు కట్నం తీసుకుని పెళ్ళి చేసుకుని ఏడాదైంది. అతను హాయిగా జీవిస్తున్నాడు.

అసలు నిజమేమిటి? రాంప్రసాద్‌తో జీవిస్తున్నంత కాలం తన కెవరితోనూ సంబంధం లేదు. అది నిజం. అదే నిజం. తను జీవితాంతం నిరూపణ చేస్తూ ఉండాలా? అతను హాయిగా ఉన్నాడు. అందులో సగమైనా హాయిగా తనుండవద్దంటా రేంటి?

తన పరువే కాకుండా, తల్లిదండ్రుల పరువు, అన్నా వదినల పరువు, కుటుంబ పరువు మర్యాదా తననే మొయ్యమంటారేమిటి?

అరవై ఏళ్ళు నిండినా నాన్న ఇంకా అప్పుడప్పుడు అమ్మ పక్కలో చేరుతున్నా, తనని మాత్రం నిజ నిరూపణ యజ్ఞంలో నిప్పులా ఉండమంటాడేమిటి?

అవును మరి నాన్న మగాడు - అన్నయ్య మగాడు, రాంప్రసాద్ - మగాడు. వాళ్ళందరికీ నీతి, నియమం, జీవితం, కోర్కెలు, స్వేచ్ఛలు, స్నేహాలు వేరుగా రాసి ఉన్నాయి.

తను ఆడదిగా మగవాడి చేతికింద మొట్టికాయ కందుబాటులో ఉండాలి.

కస్తూరేం మాట్లాడలేదు. వారు చెప్పిన విషయానికి ఆమె దగ్గర మాటలు లేవు. ఇప్పుడు తన జీవితం తను జీవించాలంటే తన వాళ్ళనుకున్న వాళ్ళనందర్నీ దూరం చేసుకోవాలి.

"నాకీ వివాహ వ్యవస్థ మీదే నమ్మకం లేదు. నాకు నువ్వంటే ఇష్టం కలిసి బతుకుదాం" రవి మాటలు సూటిగా ఉన్నాయి.

"మరి ఈ సమాజం మన చుట్టూ ఉన్న జనం?"

"అవన్నీ మర్చిపో. మన చుట్టూ ఉన్న జనం మననేం పట్టించుకోరు. పట్టించుకొన్నా కొన్నాళ్ళే. వాళ్లకి ఎప్పటికప్పుడు కొత్త గాసిప్ కావాలి".

తను విడాకులు పొందింది. అతనికి పెళ్ళి కాలేదు. తమిద్దరూ పెళ్ళి చేసుకోవాలంటే అడ్డేమి లేదు. కానీ అతనికి వివాహం మీద నమ్మకం లేదు. కస్తూరేం మాట్లాడలేదు. తనకుందా నమ్మకం? ఏమో? లేదంటే దేని మీద నమ్మకముంది?

"నా మీద నీకు నమ్మకముందా లేదా అన్నది నువ్వు నిర్ణయించుకోవాల్సిన విషయం"

"నమ్మకమే లేకపోతే ఇంత దూరం రానే రాను"

"గుడ్!"

❖ ❖ ❖

పెద్ద యుద్ధమే జరిగింది. ఇంట్లో అందరూ నానా మాటలు అన్నారు. చివరికి "ఇది ఇలాంటిది కాబట్టే రాంప్రసాద్ అలా అన్నాడు. అలా చేశాడు" అంటూ మొత్తానికి రాంప్రసాద్ మంచివాడేనని అతనిదేం తప్పులేదని, ఆడదానికంత పొగరు, స్వేచ్ఛ పనికి రాదని తీర్మానించారు.

'నా తల్లి పేరెట్టుకున్నాను, దీన్ని నేను వదల్లేను' అంది తల్లి. కస్తూరి చంటిదాన్ని బలవంతంగా లాక్కెళ్ళి పోవాలనుకోలేదు. అమ్మమ్మ గుండెల్ని బల్లిలా అతుక్కుపోయిన కూతుర్ని వదిలి కస్తూరి అడుగు బయటకు వేసింది.

సింగిల్ బెడ్ రూం ఫ్లాట్‌లో ఒంటరి జీవితం ప్రారంభించింది. పిల్ల కోసం తల్లి దగ్గర కెళ్తే ఆమె కన్నీళ్ళతో పలకరిస్తుంది. వదినగారు ఒక పలకరింపు నవ్వుతో ఒక కప్పు కాఫీ ఇస్తుంది. తను తీసుకెళ్ళిన బొమ్మలు, బిస్కట్లు తీసుకుని బుల్లి సావిత్రి మురిసిపోతుంది. తిరిగి వస్తూ పిల్ల ఖర్చు నిమిత్తం తల్లి చేతిలో డబ్బులు పెడుతుంది.

ఆమె గుట్టుగా తీసుకుంటుంది. అలాంటప్పుడు కస్తూరి మనసులో తీవ్రమైన ఆలోచనలు రేగుతాయి. ఆ చంటిపిల్ల బాధ్యత ఎవరిది? తన తల్లిదండ్రులు చూసి, చేసిన మగాడితో పడుకున్నందుకు పుట్టిన బిడ్డ బాధ్యత తనదేనా? తండ్రికి, తాతకి, అమ్మమ్మకి మావయ్యకి ఎవ్వరికీ లేదా? ఈ సమాజం ఆ బాధ్యత ఎంత నేర్పుగా తన మీద మోపింది. డబ్బు ప్రధానం కాదంటూనే ప్రతిదీ డబ్బు దగ్గరే ఆగిపోవడం గమనిస్తుంటే భయం వేస్తుంది. తనే పోషించాలా బిడ్డని. తనిచ్చే డబ్బు కాస్త ఆలస్యమైతే సహించలేరు. ఏమన్నా అంటే "నీ మొగుడితో నువ్వు సర్దుకుపోలేక పోయావు" అంటారు సర్దుకుపోవడమనే మాట ఎంత ఆలోచించినా కస్తూరికి అర్థం కాలేదు.

❖ ❖ ❖

బయట సన్నగా జల్లు పడుతోంది. బాల్కనీలో కుర్చీ వేసుకుని కస్తూరి కింద తిరిగే జనాన్ని అప్పుడప్పుడు ఆకాశంలో మబ్బుల్ని, కురుస్తున్న వర్షాన్ని చూస్తోంది. రవి గురించి ఆలోచించే కొద్దీ అయోమయంగా ఉంది. దూరం నుండి అర్థం కాని ఎన్నో సంగతులు అత్యంత సన్నిహితంగా మసలినప్పుడే తెలుస్తాయి. రవి డబ్బు ఖర్చు చేయడంలో అదుపంటూ ఉండదు. తనదనీ, పక్కవారిదనీ ఉండదు. ఆవేశం వస్తే జల్సా చెయ్యాలంటే అప్పు చేసైనా ఖర్చు పెట్టేస్తాడు. అతని జీతం వచ్చిందొచ్చినట్టు వారం రోజుల్లో ఖర్చయిపోతుంది. ఆ సమయంలో అంతా ఆనందమే, రోజూ సినిమాలు, షికార్లు, హొటళ్ళలో భోజనాలు, ఆ తర్వాత మామూలే, చేతిలో డబ్బు ఉండదు, కస్తూరి ఈ రెండో జీవితంలో డబ్బు గురించి అస్సలు మాట్లాడకూడదనుకుంది. అందుకే ఏం మాట్లాడలేదు. అతను డబ్బు విసురుగా ఖర్చు పెడుతుంటే తనూ ఆ సరదాలో భాగం పంచుకొని, తీరా తన డబ్బు దగ్గర కొచ్చేసరిక వెనుకాడడం అన్యాయమనిపించింది. పర్యవసానం రవి చేసిన చాలా అప్పులు కస్తూరి ఆఫీసులో లోన్ తీసుకొని తీర్చాల్సి వచ్చింది.

కస్తూరి ఆలోచన మరో వైపుకి మళ్ళింది. తను చేసిన రూపకానికి ఆకాశవాణి జాతీయ అవార్డు రావడం మనసుకి ఎంతో ఉత్సాహంగా ఉంది. ఆ రోజు రవి డ్యూటీకి రాలేదు. అతనెప్పుడొస్తాడా ఈ శుభవార్త చెప్దామని చూస్తోంది. అతనింకా రాలేదు.

రచన తనే చేసింది. రికార్డింగ్ చేసి, రెండు రాత్రులు కూచుని రూపకానికి డబ్బింగ్ చేసింది. కాపీలు తయారుచేయించి, ఢిల్లీ పంపే ఏర్పాటుకు సుమారు

నెల్లాళ్ళు శ్రమపడింది. కానీ దానిమీద రవి - కస్తూరి సంయుక్త సృష్టి అని రాసింది. అతను ఒక్క రోజు తనతో కలిసి రాలేదు. ఒక్క సలహా ఇవ్వలేదు. ఒక్క సాయం చేయలేదు. అతని ఊహ గానీ, ప్లానింగ్ గానీ అస్సలు లేదు. కానీ అతని పేరందులో చోటు చేసుకుంది. ఒకరిద్దరు బాహాటంగానే అన్నారు.

"ఎందుకండీ ఆయన పేరు? చేసినదంతా మీరు, పేరులో పేరేమిటి?" కస్తూరి నవ్వి ఊరుకుంది. ఇలాంటివి నెమ్మదిగా మనసు మీద పనిచేస్తాయి, అవార్డు వచ్చిందనే వార్త రాగానే కస్తూరి మనసులో ఆనందం అడుగున ఒక బాధ, గులాబీ నానుకున్న ముల్లులా మెదిలింది. ఏ రకమైన అభద్రతా భావంతో తను రవికి ఇందులో భాగమిచ్చింది? పక్కలో, తిండిలో, ఇంటి నిర్వహణలో డబ్బులో, తన ప్రతిభలో చివరికి తన కీర్తిలో కూడా భాగం ఎందుకు? ఎందుకు? ఏదో కోల్పోతాననే భయంతోనా? రవి తనని వదిలి వెళ్లిపోతాడనే భయమా? ఏమో! రాంప్రసాద్‌తో విడిపోవడానికి కనీసం రెండేళ్ళు పట్టింది. కానీ రవితో రెండు గంటలైనా చాలు.

కాలింగ్ బెల్ మోగింది.

కస్తూరి గతుక్కుమన్నా వెంటనే నవ్వుతూ ఇద్దర్నీ ఆహ్వానించింది. "ఈమె నళిని నా ఫ్రెండ్. ఆమె కస్తూరి తెలుసుగా" అంటూ అర్థోక్తిగా నవ్వాడు రవి. కస్తూరికా నవ్వు ఇబ్బందిగా అనిపించింది. కానీ బయట పడలేదు.

రవి నళిని గురించేంఎక్కువ చెప్పలేదు. వండినదే ముగ్గురూ పంచుకుని తిన్నారు. మిగిలిన ఆకలి అరటిపళ్లతో తీర్చుకున్నారు. ఒకే బెడ్‌రూంలో రవి కింద చాప వేసుకుని పడుకుంటే కస్తూరి, నళిని బెడ్ మీద పడుకున్నారు. కస్తూరికి ఎలాగో ఉంది. స్త్రీ పురుష సంబంధాలలో నాది, నా వాడు, అనే భావం (పొసెసివ్ ఇన్‌స్టింక్ట్) ఉండకూడదనేది ఆదర్శమో, ఆలోచనో కావచ్చుగాని దాన్ని ఆచరించటం కష్టం. బతుకు, ఇల్లు, మనసు అంతా ఇరుకైపోయినట్లనిపించింది కస్తూరికి.

అప్పుడొచ్చిన నళిని అలాగే ఉండిపోయింది. అదేమంటే ఆమె కష్టాల్లో ఉంది. ఆదుకోవాల్సిన బాధ్యత తనకుంది అన్నాడు. వాళ్ళిద్దరూ ఎన్నాళ్ళగానో పరిచయం ఉన్నట్లు ప్రవర్తిస్తుంటే కస్తూరికి విసుగ్గా ఉండేది. ఆమె తరచు అతని ఒళ్ళో తలపెట్టుకుని ఏడుస్తుంటే అతను ఓదారుస్తుంటే కస్తూరికి అసహనం ఆవరించేది.

కస్తూరికి జీవితం ఒక్కసారిగా స్పష్టమైంది. ఈ ఆవిరి గదిలో తను బతకలేదని పించింది.

❖ ❖ ❖

కొత్తగా పెట్టిన ఎఫ్ ఎమ్ రేడియో స్టేషన్‌కి పెక్స్‌గా ప్రమోషన్ మీద కస్తూరికి ఆర్డర్సు రావడంతో ఒక్కసారి ఊపిరి పీల్చుకున్నట్లనిపించింది. ఉన్నాడో లేడో తెలీని దేవుడికి చేతులెత్తి నమస్కరించింది. ఆ రోజే రిలీవై సామాను సర్దేసింది. రవితో 'ఎలా చెప్పాలా, ఏం మాట్లాడాలో' అన్న సంశయం క్షణంలో తీరిపోయింది. అతనేం మాట్లాడలేదు. ప్రమోషనొచ్చినందుకు అభినందించాడు. ఇంటికెళ్ళి సావిత్రిని తీసుకుంది. తల్లి మళ్ళీ కళ్ళనీళ్ళెట్టుకుంది.

"అమ్మా! పాప మరీ ఏడ్చి గొడవ చేస్తే తెలియజేస్తాను. వస్తావా?" అంది కస్తూరి.

ఆమె అటూ ఇటూ చూసి "ఏకంగా వచ్చేమన్నా వస్తానే. ఈ ఇంటిలో మగాళ్ళకి చాకిరీ చేయలేక ఛస్తున్నా. వంట్లో శక్తి ఉడిగిపోయినా పని తప్పడం లేదు. ఇన్నాళ్ళూ నువ్వు డబ్బులిస్తున్నావు కనుక మందులైనా ఉన్నాయి. ఇక ముందు అవీ ఉండవు". వార్ధక్యంతో వడలి, బడలికగా ఉన్న తల్లిని చూసింది. నిశితంగా చూసింది. స్త్రీకి ఎక్కడ రక్షణ? ఎక్కడ భద్రత? ఎక్కడ ప్రేమ? ఎక్కడ సమానత్వం? తల్లిని చూస్తే కడుపు తరుక్కుపోయింది.

"అలాగే రెడీగా ఉండు" అంది.

"నేనన్నాననీ..."

అంత బాధలోనూ కస్తూరికి నవ్వు వచ్చింది. స్త్రీ జాతికి నరనరాల్లోనూ జీర్ణించుకుపోయిన పిరికితనం, అభద్రత ఎన్ని యుగాలు పోరాడితే వీటిని తొలగించగలం?

❖ ❖ ❖

"అమ్మా! అమ్మా" అయిదేళ్ల సావిత్రి కస్తూరిని కుదిపింది. తన ఆలోచనల్లోంచి తేరుకుని అనాసక్తంగా "ఏమిటమ్మా" అంది కస్తూరి.

"నా పుస్తకంలో మొదటి పేజీ చింపేశాడు"

"ఎవరూ?"

"అదిగో. వాళ్ల నిక్కీ"

"పోనీలే"

"దాని మీద చక్కని బొమ్మ ఉంది. అది చింపేశాడు" ఏడుపు అందుకుంది. కస్తూరికి సర్రున కోపం వచ్చి చల్లారిపోయింది. దుఃఖం పొంగుకొచ్చింది. పుస్తకానికి

మొదటి పేజీ - అందమైన మొదటి పేజీ చిరిగిపోతే పోనీలే అని ఎలా అనుకోగలం? కోల్పోయిన అందాన్ని మళ్లీ ఎలా సమకూర్చుకోగలం? ఆ నవ్యతని ఎలా సృష్టించగలం? ఆ లోటును ఎలా పూరించగలం?

"రెండో పేజీ జాగ్రత్తగా చూసుకో" అంది సావిత్రిని బుజ్జగిస్తూ. "రెండో పేజీ నిండా పిచ్చి గీతలు, దాన్ని నేనే చింపేస్తాను" అంది సావిత్రి కస్తూరి కూతురి వంక చూస్తుండిపోయింది. సావిత్రి తన బుల్లి బుల్లి చేతులతో తెల్లగా, నీట్‌గా ఉన్న మూడో పేజీ సాపుగా రాస్తూ, "ఇది బాగుంది కదమ్మా" అంది.

"అవును చాలా బాగుంది. జాగ్రత్త ఈ మూడో పేజీ" అంది కస్తూరి ఏదో ఆలోచిస్తూ

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 19.2.1997)